## క్లుప్తంగా

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి

దౌల్తాబాద్: మండలంలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంగళవారం కడా అధికారి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో 125 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం కడా అధికారి మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ప్రభుత్వం నగదును అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దారు విజయ్‌కుమార్, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు.

### కలెక్టర్ ఆదేశంతో కదలిక

పాఠశాల ఆవరణలో చెత్తను తొలగించిన మున్సిపల్ సిబ్బంది



చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

కొడంగల్: కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని సీపీఎస్ పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. పాఠశాల పైభాగంలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తీసి వేశారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదులు వానలకు కురుస్తున్నాయి. ఈ నెల 20న కలెక్టర్ ప్రతీక్ జైన్ పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పైభాగంలో ఉన్న చెత్తను తొలగించాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

### గొర్రె కాపరుల సంఘం నూతన కార్యవర్గం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లిలో మంగళవారం గొర్రె కాపరుల సంఘం నూతన కార్యవర్గం నియమించుకున్నారు. శ్రీమల్లికార్జున గొర్రె కాపరుల సంఘం అధ్యక్షుడిగా కుర్వ బస్వరాజు, ఉపాధ్యక్షుడిగా బత్తుల శ్రీనివాస్, డైరెక్టర్లుగా చిన్న కిష్టప్ప, సాయన్న, ఎల్లప్ప, కణావతి, పెద్దకుర్వ గొరమ్మలను ఎన్నుకున్నారు. గ్రామంలోని కురువ, గొల్ల కాపరుల అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో నాయకులు నిర్మల, శేఖర్, జోగురాజు, రాజు, మల్లేశం, అంజిలప్ప, హన్మప్ప, రామచంద్రప్ప, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ పాఠశాలల బలోపేతానికి కృషి



నోట్‌పుస్తకాలు అందజేసిన శంకర్‌నాయక్ తదితరులు

కుల్కచర్ల: గ్రామీణ బడులను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం చౌడపూర్ మండలం వాల్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆయన ఉచితంగా నోట్‌పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, నాయకులు పాండునాయక్, హన్మంతు, భాస్కర్, జగన్, విశాల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### కమాన్ నిర్మాణానికి విరాళం

కుల్కచర్ల: మరికల్ గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయ కమాన్ నిర్మాణానికి గ్రామవాసి భర్కనూరి రవికుమార్ మంగళవారం విరాళం ఇచ్చారు. తన తండ్రి శ్రీనివాస్ జ్ఞాపకార్థం రూ.50వేల ఒక వంద నగదును అందజేశారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

### ప్రధానోపాధ్యాయుల బదిలీలు

తాండూరు రూరల్: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులకు సాధారణ బదిలీలు అయ్యాయి. బదిలీలకు సంబంధించి మంగళవారం ఉత్తర్వులు వచ్చినట్లు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. చిట్టిఘనాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కిష్టప్ప చెంగోల్ పాఠశాలకు స్థానచలనంపై వచ్చారు. మల్కాపూర్ హెచ్ఎంగా పని చేసిన నాగప్ప జినుగుర్తి ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. కరన్‌కోట్ హెచ్ఎం నర్సిరెడ్డి చిట్టిఘనాపూర్‌కు, అంతారం హెచ్ఎం శ్రీలత గోనూర్ పాఠశాలకు వెళ్లారు. ఉద్దాండపూర్ హెచ్ఎం రవీందర్‌కుమార్ శర్మ సంగెంకలాన్‌కు స్థానచలనం చెందారు. గోనూర్ హెచ్ఎం ఈశ్వరమ్మ ఉద్దాండపూర్ పాఠశాలకు స్థానచలనంపై వెళ్లారు. పది సంవత్సరాల తర్వాత హెచ్ఎంలు బదిలీపై ఆయా పాఠశాలలకు వెళ్లారు.

# 36 జీపీలు.. 35 వేల అకౌంట్లు!




దోమలోని ఎస్‌బీఐ



బ్యాంకులో క్యూలో పడిగాపులు కాస్తున్న ఖాతాదారులు (ఫైల్)

- దోమ ఎస్‌బీఐలో సిబ్బందికి పనిభారం
- ఖాతాదారుల సతమతం
- ఇరవై రోజుల నుంచి ఖాళీగా మేనేజర్ పోస్టు

దోమ: ప్రస్తుతం ఎక్కడ చూసినా డిజిటల్ చెల్లింపుల యుగం నడుస్తోంది. ప్రభుత్వాలు సైతం వాటినే ప్రోత్సహిస్తున్నాయి. ఈ వ్యవహారానికి బ్యాంకులే ముఖ్య ఆధారం. అందులో పని చేసే ఉద్యోగులు తమ పనితీరుతో సామాన్యులను సైతం బ్యాంకింగ్ రంగంలో భాగస్వాములు చేయాలి. కానీ దోమ ఎస్‌బీఐ బ్యాంకులో ఉద్యోగులు మితిమీరిన పని భారంతో ఖాతాదారులకు విసుగు తెప్పిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తూ చర్చనీయాంశంగా మారుతున్నారు. దీనికి ప్రధాన కారణం మండలం మొత్తానికి ఒకే ఎస్‌బీఐ ఉండడమే.

**35 వేలకు పైగా ఖాతాదారులు**

మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ దోమలో ఒకే ఎస్‌బీఐ బ్రాంచ్ ఉంది. ఇందులో సుమారు 35 వేల మందికి పైగా ఖాతాదారులు ఉన్నారు. మేనేజర్ ఇటీవలే వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లడంతో దాదాపు ఇరవై రోజులుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. బ్యాంకును కేవలం ముగ్గురు సిబ్బందితో మాత్రమే కొనసాగిస్తున్నారు. దీంతో భారీ సంఖ్యలో ఉన్న ఖాతాదారుల నుంచి మితిమీరిన పని ఒత్తిడి కలుగుతోంది. నిత్యం ఆయా గ్రామాల నుంచి అనేక మంది ఖాతాదారులు వివిధ పనుల నిమిత్తం బ్యాంకుకు వస్తారు. వీరి పట్ల సదరు సిబ్బంది పనిభారంతో కొంత దురుసుగా ప్రవర్తిస్తున్నారు. పనులు సైతం సక్రమంగా చేయడం లేదని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. డబ్బులు కోసం వస్తే మేనేజర్ లేరని చెబుతున్నారని, గంటల తరబడి క్యూలో నిలబడితే కొందరికే నగదు ఇచ్చి.. మిగిలిన వారిని ఉట్టి చేతులతో పంపిస్తున్నారని మండిపడుతున్నారు.

**అదనపు బ్రాంచ్ ఏర్పాటు చేయాలి**

మండలంలో సుమారు 50 వేలకుపైగా జనాభా ఉంది. వీరందరికీ ఒకే ఎస్‌బీఐ ఉండడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు, రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అందరి ఖాతాలు ఇక్కడే ఉన్నాయి. ఫలితంగా ఉద్యోగులకు సైతం పని ఒత్తిడి కలుగుతోంది. దీనికి తోడు ఈకేవైసీ, ఆధార్ లింకు, పాత ఖాతాల పునరుద్ధరణ, కొత్త అకౌంట్లు తెరవడం వంటి పనులకు నిత్యం పెద్ద సంఖ్యలో జనాలు వస్తుంటారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారిపై పనిభారం ఎక్కువవుతోంది. ఈ ఒత్తిడిలోనే ఖాతాదారులను కసురుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మరో బ్రాంచి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**పనులు జరగడం లేదు**



ఈకేవైసీ చేయించేందుకు బ్యాంకుకు వెళ్లాం. రోజుకు ఇరవై మందికి మాత్రమే చేస్తామని సిబ్బంది చెబుతున్నారు. వచ్చిన వారు మాత్రం వందల సంఖ్యలో ఉన్నారు. ఈకేవైసీ చేయకపోతే లావాదేవీలు సక్రమంగా జరగడం లేదు. నగదు తీసుకోవడానికి సైతం తీవ్ర అవస్థలు పడుతున్నాం. బ్యాంకులో సరిపడా సిబ్బందిని నియమించాలి.

– ఈడిగి రమేశ్‌గౌడ్, దోమ

# ప్రజాస్వామ్యంలో ఎమర్జెన్సీ చీకటి రోజు



నిరసనలో పాల్గొన్న నాయకులు

**తాండూరులో బీజేపీ నిరసన**

తాండూరు టౌన్: దేశ వ్యాప్తంగా 1975లో అత్యవసర పరిస్థితి విధించి ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ అవహేళన చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్ ఆరోపించారు. ఎమర్జెన్సీ డే సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్‌చౌక్‌లో బీజేపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నిరసన చేపట్టిందన్నారు. ఆనాడు స్వార్థ రాజకీయాల కోసం దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించి రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ అగౌరవపరిచిందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ.. దేశంలో అత్యవసర పరిస్థితి విధించడం, ఒక చీకటి రోజుగా నేటికి గుర్తుండి పోయిందన్నారు. నిరసనలో బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం, నాయకులు జగదీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీలింగ్ భూమిని పేదలకు పంచాలి

**సీపీఐ పరిగి డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్**

పరిగి: ప్రభుత్వ సీలింగ్ భూమిని పేదలకు పంచాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో మిట్టకోడూర్ గ్రామంలోని సీలింగ్ భూమిని పేదలకు కేటాయించాలని డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీలింగ్ భూమిని అన్యాక్రాంతం అయిందన్నారు. పేదలకు అందాల్సిన భూమిని బడాబాబులు మాత్రమే అనుభవిస్తున్నారన్నారు. గ్రామంలో భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎంతో మంది ఉన్నారని.. ఒక్కొక్కరికి మూడు ఎకరాల చొప్పున పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, యాదయ్య, రాంచంద్రయ్య, వెంకటయ్య, బందెయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

# ప్రభుత్వ బడులకు అన్ని వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

మర్పల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, మండల విద్యాధికారి విద్యాసాగర్ ఆకాంక్షించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 47 ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం అమ్మ ఆదర్శపాఠశాల కింద నిధులు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే 45 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయన్నారు. పాఠశాలలో ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడుతామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్ కృష్ణారావు, సీఆర్‌పీలు, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



**• యువ నాటకోత్సవం**

తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, రంగస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పరిగిలో 'యువ నాటకోత్సవం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక కార్యకర్త డాక్టర్ చెర్క సత్తయ్య జ్యోతి ప్రజ్వలన చేసి నాటకోత్సవాన్ని ప్రారంభించారు. భారతీయ కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. – పరిగి

### 'నేడు పాఠశాలల బంద్'

అనంతగిరి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం చేపట్టే పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తూ.. అనుమతి లేకుండా పుస్తకాలు అమ్ముకుంటూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు రాష్ట్రం వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో బంద్ చేపడుతున్నట్లు తెలిపారు.

### నేడు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు

తాండూరు టౌన్: పట్టణంలో పోటీ పరీక్షల ప్రిపరేషన్ కోసం కెరీర్ గైడెన్స్‌పై అభ్యర్థులకు బుధవారం ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు తాండూరు స్టడీ సర్కిల్ డైరెక్టర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎస్‌బీఐ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత అభ్యర్థులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక అంబేడ్కర్‌చౌక్ సమీపంలోని జగదాంబ టవర్స్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### తరగతి గదుల పరిశీలన

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తరగతి గదులను మంగళవారం నోడల్ అధికారి శంకర్‌నాయక్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పరిశీలించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. కళాశాలకు కొన్ని తరగతి గదులను కేటాయించాలని కోరారు. ఆయా హెచ్ఎంలు సానుకూలంగా స్పందించి కేటాయించడానికి సిద్ధమయ్యారు. తహసీల్దారు కార్యాలయంలో రికార్డులకు స్థలం పరిశీలించారు. కళాశాలలోని జనరల్ గ్రూపులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలతోపాటు ఒకేషనల్ కోర్సులు మంజూరైనట్లు తెలిపారు. అందుకు కావాల్సిన 4 వేల పుస్తకాలు వచ్చాయని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ వివరించారు. త్వరలోనే తరగతులు ప్రారంభిస్తామని నోడల్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తత ముఖ్యం

మర్పల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి మర్పల్లి ఏఎస్‌ఐ మల్లేశం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంతలో పోలీసు సిబ్బందితో కలిసి ఆయన సైబర్ నేరాలు, సంతలో జరిగే చోరీలు, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. శరవేగంగా వృద్ధి చెందుతున్న ఇంటర్ నెట్‌తో ప్రతి రోజు ఏదో విధంగా నేరాలు జరుగుతున్నాయని అందుకుగాను ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### కొనసాగుతున్న అభివృద్ధి పనులు

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీల చైర్మన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అబీబ్ అహ్మద్, ఎంపీఓ ఖరీం, ఏపీఎం శోభ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులతో అప్రమత్తత

**మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్**

పరిగి: సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరమని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని 4వ వార్డులో డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా డ్రైనేజీల్లో మందును పిచికారీ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుగానే అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పురపాలక సంఘం దృష్టికి తీసుకురావాలని సూచించారు. పట్టణంలో నిత్యం పారిశుద్ధ్య కార్మికులచే పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడ అపరిశుభ్రత లేకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు రవీందర్, మలేరియా యూనిట్ అధికారి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీలో మందు పిచికారీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

# నీట్, నెట్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

**పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్**

తాండూరు టౌన్ : నీట్, యూజీసీ నెట్ పరీక్షలను కేంద్ర ప్రభుత్వం మళ్లీ నిర్వహించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. అలాగే పేపర్ లీకేజీలతో పరువు కోల్పోయిన కేంద్ర ప్రభుత్వం నీట్, యూజీసీ నెట్ పరీక్షల రీషెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. అభ్యర్థుల పరీక్ష ఫీజును రీఫండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ తాండూరు డివిజన్ నాయకులు నవీన్, బన్ని, బీజే శ్రీనివాస్, శివకుమార్, జయప్రకాష్, శ్రావణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత

బొంరాస్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా అధ్యక్షుడైనా బొట్లోనితండా గ్రామపంచాయతీలోని దేవులానాయక్‌తండాకు చెందిన నెహ్రూనాయక్ భార్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. దీంతో విదేశాల నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మంగళవారం నెహ్రూనాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.50 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుపతయ్య, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మధుయాదవ్, దేశ్యానాయక్, చాంద్‌పాషా, లక్ష్మణ్‌నాయక్, నర్సింగ్ ఉన్నారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం**

దుద్యాల్: మండలంలోని హకీంపేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పిరంగి రాములు ఇటీవలే మృతిచెందారు. దీంతో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ మేరకు మృతుడి కుమారుడు వెంకటయ్యకు ఆయన ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నరేశ్, సోమనాథ్, సురేశ్‌రాజ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నరేందర్‌రెడ్డి

# రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ



యాలాల: వీసీలో పాల్గొన్న రైతులు, అధికారులు

**వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ అధికారులు**

యాలాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతుభరోసా పథకంపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనిలో తాండూరు ఏడీఏ రుద్రమూర్తి, వివిధ మండలాల వ్యవసాయ అధికారులతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పదెకరాల లోపు రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని, కౌలు రైతులకు సైతం భరోసా పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు సూచించారు. ఆర్థికంగా ఉన్న వారితో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, ఫాం హౌజ్‌ల యజమానులకు ఈ పథకం వర్తించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధికారులు యాదగిరి, రజిత, రైతులు ఉన్నారు.

**అన్నదాతల సూచనలు**

బొంరాస్‌పేట: ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా పథకం అమలు తీరుపై రైతుల నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో రైతు నేస్తం ఏర్పాటు చేశారు. పది ఎకరాలకు మించి ఉన్న భూమికి, రియల్ ఎస్టేట్ భూమికి రైతుభరోసా ఇవ్వొద్దని రైతులు అభిప్రాయాలు వ్యక్తం చేశారని ఏడీఏ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. అలాగే వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు రకాల సూచనలు, సలహాలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కొడంగల్, బొంరాస్‌పేట ఏఓలు అనురాధ, లావణ్య, పలు క్లస్టర్ల ఏఈఓలు పాల్గొన్నారు.

# ఏకకాలంలో రుణమాఫీ హర్షణీయం

కుల్కచర్ల: ఏకకాలంలో ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడం అభినందించదగ్గ విషయమని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రైతులు అభివృద్ధి సాధించినప్పుడే దేశం వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, ఎంపీటీసీలు ఆనందం, రాంలాల్, నాయకులు గోపాల్ నాయక్, స్వామి, అంజిలయ్య, కృష్ణ, శ్రీనివాస్, శ్రీను, రాజునాయక్, రఘునాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్లలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

# వానలు కురవాలని ప్రత్యేక పూజలు



ధారూరు: కాడికి వేప ఆకులు, కప్పను కట్టి చిన్నారులతో ఊరేగింపు

ధారూరు: వర్షాల కోసం స్థానికులు మంగళవారం వరుణదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల వానలు లేక పంటలు ఎండుముఖం పడుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన రైతులు, మహిళలు కలిసి కాడికి వేప ఆకులు, కప్పను కట్టి చిన్నారుల భుజాన పెట్టి ఊరేగించారు.



పూడూరు: అంగడిచిట్టంపల్లిలో కాడికి కప్పను కట్టి పూజలు చేస్తున్న గ్రామస్తులు

**జాడ లేని వరుణుడు**

పూడూరు: వానలు కురవాలని కప్పను కాడికి కట్టుకుని మండలంలోని అంగడిచిట్టంపల్లి గ్రామంలో ఊరేగించారు. విత్తనాలు విత్తుకుని పక్షం దాటినా వరుణ దేవుడు కరుణించడంలేదని రైతులు వాపోయారు. చన్గోముల్ గ్రామంలో వరదపాశం వేసి అందరు ప్రసాదంగా స్వీకరించారు.